క్లుప్తంగా

ఆరోగ్యశాఖ మంత్రికి వినతి



వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిధుల కొరతతో అసంపూర్తిగా ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్యకర్తలు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రి ప్రస్తుతం మరో చోట నిర్వహించడంతో రోగులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలంటే రూ.50 లక్షల అవసరం ఉందని వివరించారు. త్వరలోనే పరిశీలించి నిధులను మంజూరు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీసింగ్, భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం



అచ్చంపేట రూరల్: గ్రామీణ స్థాయిలో ఆర్‌ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆర్‌ఎంపీ వైద్యులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసి సమస్యలను విన్నవించారు. అలాగే డాక్టర్స్‌డేను పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణ

నాగర్‌కర్నూల్‌రూరల్: బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న కే రామకృష్ణను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

కొల్లాపూర్: పట్టణం నుంచి హైదరాబాద్, కర్నూల్ రూట్లలో ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేవారికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ నిర్ణయానుసారం డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేవారు తమ టికెట్ల వెనుక పేరు, ఫోన్‌నెంబర్ రాసి ఆర్టీసీ బస్టాండ్లలో ఏర్పాటుచేసిన గిఫ్ట్ బాక్సుల్లో వేయాలన్నారు. 15 రోజులకోసారి బాక్సుల్లోని టికెట్లను తీసి లక్కీడిప్ ద్వారా ప్రయాణికుల్లో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రికార్డుల పరిశీలన



తాడూరు: మండలంలోని ఐతోల్, బలాన్‌పల్లి పాఠశాలలను మంగళవారం కాంప్లెక్స్ చైర్మన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించాలని సూచించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

కల్వకుర్తి టౌన్: డివైడర్‌ను బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంచందర్‌జీ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్‌లోని శ్రీపురంకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై గ్రామం నుంచి కల్వకుర్తి వెళ్తున్నారు. పట్టణంలోకి రాగానే సిల్వర్‌జూబ్లీ క్లబ్ వద్ద బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సాయిదీపక్ తలకు తీవ్ర గాయాలు కాగా, నవీన్‌చారికి స్వల్ప గాయాలయ్యాయి. సాయిదీపక్‌ను పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

మాజీ ఎమ్మెల్యేను అవమానించడం సరికాదు

తాడూరు: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ ట్రస్ట్ ద్వార రూ.కోట్ల వెచ్చించి నిర్మించిన పాఠశాల భవన ప్రారంభానికి మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్ రెడ్డిని ఆహ్వానించకపోవడం ఆయనను అవమానించడమేనని మండల ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, నాయకులు జంగయ్య, మాజీ ఎంపీటీసీ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సిర్సవాడలో కూడా పాఠశాల భవనాలను నిర్మించారని గుర్తు చేశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రతాప్, రాజు, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ సేవలు ఏవి?

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు



మన్ననూర్‌లో నిరుపయోగంగా ఉన్న డయాగ్నోస్టిక్ కేంద్రం భవనం

మన్ననూర్: నాణ్యమైన వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రక్త, ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షల కోసం రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.వేలలో ఖర్చులు అవుతుండటంతో పేదల జేబులకు చిల్లు పడుతోంది. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలు, మారుమూల ప్రాంత చెంచు పెంటల్లోని చెంచులకు నాణ్యమైన వైద్య సేవలతో పాటూ మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, మధుమేహం, హిమోగ్లోబిన్, థైరాయిడ్ వంటి పరీక్షలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో రోగుల సౌకర్యార్థం రూ. లక్షలు వ్యయం చేసి డయాగ్నోస్టిక్ కేంద్రం భవనాన్ని నిర్మించారు. మన్ననూర్‌లో సుమారు రూ. 98 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో భవనం నిర్మాణం పూర్తి చేశారు. 12 ఏళ్ల కిందట ఏజెన్సీ ప్రాంతాలైన మన్ననూర్, లింగాల, బల్మూర్ పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. డయాగ్నోస్టిక్ కేంద్రం ఉన్నా సేవలు అందుబాటులోకి రాకపోవడంతో రోగులు బాధలు అంతాఇంతా కాదు. పరీక్షల కోసం అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నా ప్రభుత్వ పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలో విభిన్నంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డయాగ్నోస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకోలేం



ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం ఖర్చులు అధికం అవుతున్నాయి. డబ్బులు లేక ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇక్కడ కూడా పరీక్షలు చేయడం లేదు. రక్త పరీక్షలు చేసుకునేందుకు ఆర్థిక స్థోమత లేదు. పరీక్షలకు అధికంగా డబ్బులు అవుతుండటంతో పరీక్షలు చేయించుకోలేకపోతున్నా. మన్ననూర్‌లో అన్ని రకాల పరీక్షలు చేసి మందులు ఇస్తే బాగుంటది.

–మెండ్లి నాగమ్మ, మేడిమల్కల పెంట

అచ్చంపేటకు వెళ్లాల్సిందే..



అనారోగ్యానికి గురైనప్పుడు మన్ననూర్ ఆస్పత్రికి వస్తే పరీక్షలు కోసం అచ్చంపేటకు పంపిస్తున్నారు. పెద్ద ఆస్పత్రి, పట్టణం అయినందున అక్కడ మమ్ములను ఎవరు పట్టించుకోవడం లేదు. అక్కడకు వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మన్ననూర్‌లోని పీహెచ్‌సీలో అన్నిరకాల టెస్టులు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నిమ్మల గురువయ్య, అప్పాపూర్ పెంట

గ్రామీణ రోడ్లను మెరుగుపరుస్తాం

బల్మూర్: గ్రామీణ రోడ్లను మెరుగుపరుస్తామని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని జినుకుంట స్టేజీ నుంచి పోలేపల్లి మీదుగా ఎంఆర్ఆర్ నిధులు రూ.3.60 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన మంత్రి సీతక్కకు మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. కోలాటాలతో మహిళలు ఘన స్వాగతం పలికి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్యే డాక్టర్



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పదర జెడ్పీటీసీ

వంశీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: పీఏసీఎస్ పరిధిలో ఉన్న రైతులకు పూర్తి స్థాయి రుణమాఫీ అయ్యే విధంగా చూడాలని రాయలగండి క్షేత్రానికి వచ్చిన పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు పదర జెడ్పీటీసీ రాంబాబునాయక్ వినతి పత్రం అందజేశారు. పీఏసీఎస్ పరిధిలో అమ్రాబాద్, పదర మండలాలకు చెందిన మొత్తం1824 మంది రైతులు రుణాలు తీసుకున్నారని వివిధ కారణాలతో రైతుల రుణమాఫీకి సంబంధించి వివరాలు అధికారులు తీసుకోవడం లేదని వివరించారు.

నేడు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వీడ్కోలు

లింగాల: పదవీ కాలం పూర్తి చేసుకోనున్న మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4:00 గంటలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తెలకపల్లి: మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులకు బుధవారం ఉదయం 11.30 గంటలకు వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులు, ప్రత్యేకాధికారులు హాజరవ్వాలని కోరారు.

బల్మూర్: మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పదవి కాలం ముగియనుండటంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహిస్తునట్లు మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యార్థులు పస్తులు

లింగాల: మండలంలోని చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పునఃప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటం లేదు. దీంతో పేద విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలో 70 మంది వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజనం వడ్డించకపోవడంతో కొందరు విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో వంటలు వండే కార్మికులకు గ్రామ పంచాయతీ నుంచి రావాల్సిన బకాయిలు రాక పోవడంతో అందుకు నిరసనగా వంటలు చేయడం మానివేశారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం సతీష్‌కుమార్ వివరణ కోరగా ఇటీవలనే బదిలీపై రావడం జరిగిందని, మధ్యాహ్న భోజన విషయంలో గ్రామస్తులతో చర్చించి వంట వారిని ఒప్పించినట్లు తెలిపారు. బుధవారం నుంచి వంటలు చేసేందుకు కార్మికులు ముందుకు వచ్చారని వివరించారు.

ఘనంగా డాక్టర్స్ డే



కొల్లాపూర్: పట్టణంలో జాతీయ వైద్యుల దినోత్సవరం సందర్భంగా మంగళవారం సీనియర్ డాక్టర్లు వెంకటసుబ్బయ్య, వి.జ్ఞానేశ్వర్, హిమకుమారిలను డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఇటీవల దంత వైద్య విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న డాక్టర్ శ్యాంప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు జయచంద్రప్రసాద్ యాదవ్, బిల్లా యాదగిరి, రమేష్, ప్రేమస్వరూప, దిలీప్, ఉషారాణి, ప్రవీణ్‌కుమార్, శివరాజ్, విజయ్‌కుమార్, సూర్యనాయక్, ప్రవళి, ఫార్మాసిస్టు జీకే వెంకటేష్‌లు ఉన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయసేకరణ



కొల్లాపూర్: ప్రభుత్వం అమలుచేయనున్న రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు మంగళవారం పట్టణంలోని రైతువేదిక భవనంలో సింగిల్‌విండో డైరెక్టర్ పసుపుల నర్సింహ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ, ఏడీఏ రవిలు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులు నమోదు చేసుకున్నారు. వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, రామన్‌గౌడ్, తిప్పరాజుల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి సన్మానం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన ఆర్మీ ఉద్యోగి రంగరాతి తిరుపతయ్య పదవీ విరమణ పొందడంతో మంగళవారం గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకృతి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడు, వెంకటయ్య ముదిరాజ్, కృష్ణముదిరాజ్, రషీద్, చిందం కృష్ణయ్య, జంగయ్యయాదవ్, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు చంద్రశేఖర్, యాదయ్య, పురుషోత్తంరెడ్డి, మన్సూర్, తదితరులు ఉన్నారు.

డీటీఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూల్ బస్సులను సీజ్ చేయాలని బుధవారం డీటీఓ బాలుకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ వినతి పత్రం సమర్పించారు. అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వివరించారు. ఇతర రాష్ట్రాలనుంచి తక్కువ ధరలకు బస్సులను కొనుగోలు చేసుకొని ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ లేకుండా నడిపిస్తున్నట్లు తెలిపారు. వెంటనే ఆయా పాఠశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కంకర రోడ్డుతో తప్పని తిప్పలు



కంకరతో అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు

చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నేమలి గుట్టతండాకు వెళ్లేందుకు వాహనదారులు, తండావాసులు పడరాని పాట్లు పడుతున్నారు. 20 నెలల కిందట గత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.70 లక్షల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి జూపల్లి నుంచి నెమలిగుట్ట తండా వరకు 2 కిలోమీటర్ల మేర కల్వర్టులు నిర్మించారు. దీంతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2 కిలోమీటర్ల దూరం కంకర పరిచారు. దాదాపు సంవత్సర పూర్తైనా బీటీ నిర్మాణం చేపట్టలేదు. కంకరరోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. సమస్యను సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆరోగ్య సబ్ సెంటర్లు



ఆరోగ్య సబ్ సెంటర్‌లో పశువులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంంలోని వనపట్లలో గ్రామీణ ఆరోగ్య సబ్ సెంటర్‌ను అధికారులు పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో సబ్ సెంటర్ పశువుల పాకగా మారింది. 10 సంవత్సరాల కిందట 1000కి పైగా జనాభా కలిగిన గ్రామాల్లో అప్పటిప్రభుత్వం రూ.3 లక్షలు వెచ్చించి సబ్‌సెంటర్లను ఏర్పాటు చేసింది. అధికారుల నిర్వహణ లోపంతో సబ్‌సెంటర్లు నిరుపయోగంగా మారాయి. పశువుల పాకగా దర్శనమిస్తున్నాయి. ప్రతి బుధవారం సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎంలు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు, గర్భిణులకు వ్యాక్సిన్‌లు వేసేవారని ప్రస్తుతం గ్రామ పంచాయతీ వద్ద టీకాలు వేయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల పాకగా మారిన సబ్ సెంటర్‌కు మరమ్మతు చేసి వినియోగం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాసేవతోనే సంతృప్తి



పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పెద్దకొత్తపల్లి: ప్రజాసేవతోనే సంతృప్తి కలుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, ఎంపీటీసీల పదవి కాలం పూర్తి అవడంతో వారికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవి లేకున్న ప్రజా సేవ చేయాలని కోరారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు

తాడూరు: ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవి కాలం ముగియనుండటంతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ రోహిణిగోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేశామన్నారు. అందరికి అందుబాటులో ఉండి సేవ చేశామన్నారు. అనంతరం ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకెళ్లామని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివలీల, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజు ఏఈ ఉపేందర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ఎంపీడీఓ జ్యోతిప రోసియా, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బదిలీలు, బాధ్యతలు స్వీకరణ

తెలకపల్లి: మండలంలో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు అయ్యాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీలు కావడంతో వారి స్థానంలో నూతనంగా ఉపాధ్యాయులు రిలీవర్ అయ్యారు. ఎస్జీటీలు 51 మంది ట్రాన్స్‌ఫర్ కాగా 31 మంది జాయిన్ అయ్యారు. మరో 21 మంది బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ తెలిపారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన 8 మంది ఉపాధ్యాయులు జీహెచ్‌ఎంలు 5 మంది బాధ్యతలు స్వీకరించారు. ఎల్‌ఎఫ్ 11 మంది రిలీవర్ కాగా 6 మంది ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారు. స్కూల్ అసిస్టెంట్‌లు 6 మంది బదిలీ కాగా 5 మంది ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లు జాయిన్ అయినట్లు ఎంఈఓ తెలిపారు.

రైతుకు తీవ్రగాయాలు

వెల్దండ: మండలంలోని పల్గుతండాకు చెందిన రామావత్ బుజ్జి కుడిచేయి తెగి పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పశుగ్రాసం కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు గడ్డి మిషన్‌లో కుడిచేయిపడి తెగింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆమనగల్లు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



పాన్‌గల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. గర్భిణులు పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, శ్రీకాంత్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన

వీపనగండ్ల: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు సమకూరుతున్నాయనే ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చూడాలని ఏపీఓ సుల్తాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పెద్దకొత్తపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల విలువలకు సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎంఆర్ గార్డెన్‌లో 150 మంది కార్మికులకు ఎంపీపీ తన సొంత ఖర్చులతో దుస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాలు పరిశుభ్రతలో కార్మికులు కీలకం అన్నారు. ప్రభుత్వం 8 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు శశికళ, శివశంకర్, రవికుమార్, ప్రతాపరెడ్డి, రామచంద్రయ్య, వెంకటస్వామి, వైస్ ఎంపీపీ దీపిక లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, చిన్నయ్య, దండు నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

టీచర్లను రిలీవ్ చేయాలి

నాగర్‌కర్నూల్: ఇటీవల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను రిలీవ్ చేసి కొత్త స్థానాల్లో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేళ్లుగా పదోన్నతులు లేక, బదిలీలు చేపట్టక పోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడ్డారని, కోర్టు కేసులు తదితర అవాంతరాలను అధిగమించి పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరింది. అయితే జిల్లాలో 561 మంది ఎస్జీటీలు బదిలీలు పొందగా విద్యాశాఖ అధికారులు అకస్మాత్తుగా 2021లో తీసుకొచ్చిన రేషనలైజేషన్ నిబంధనలను అమలు చేస్తుండటంతో బదిలీ పొందిన ఎస్జీటీలు రిలీవ్ కాలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రేషనలైజేషన్ నిబంధనతో రిలీవర్ రాకపోవడంతో కొత్త స్థానాల్లో చేరకలేకపోయారని వివరించారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: నిరుద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ అభిలాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూపు –2, 3 నోటిఫికేషన్‌లలో పోస్టుల సంఖ్య పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయడంతో పాటు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పర్వతాలు, రాజశేఖర్‌రెడ్డి, చందుమదిరాజు, చంద్రశేఖర్, సురేష్, శివ, శశిగౌడ్, లక్ష్మీనర్సింహ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు నిలిపివేయాలని ఫిర్యాదు



మల్లయ్య గుట్టను జేసీబీతో తవ్వి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

మన్ననూర్: ప్రభుత్వ గుట్టలను కాపాడాలని కోరుతూ స్థానిక డాక్టర్ సురేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మల్లయ్య గుట్టలో తవ్వకాలు చేస్తున్న సంఘటనపై అమ్రాబాద్ తహసీల్దార్‌తో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటన స్థలానికి రావడంతో అక్రమార్కులు వాహనాలతో పరార్ అయ్యారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోగానే మళ్లీ యథావిధిగా మట్టిని తరలించడం విశేషం. గ్రామంలో కొందరు అక్రమంగా కొండలు, గుట్టలు తవ్వడానికే జేసీబీలు, అక్రమ మట్టి తరలించడానికే ట్రాక్టర్లు కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండ కొంత కాలంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టలు, చెరువులలో గోతులు చేసి గ్రామంలో నిర్మాణాలు అవుతున్న ప్రైవేటు రెస్టారెంట్లు, రిసార్టులకు మట్టి తరలిస్తూ రూ.లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కుల నుంచి గుట్టలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.